యథేచ్ఛగా ఆక్రమణలు

- హాట్‌కేక్‌లా గుమ్మటాల చెరువు స్థలాల విక్రయాలు
- మంత్రి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న చెరువు
- పట్టించుకోని అధికారులు


గుమ్మటాల చెరువులో పిల్లర్స్‌తో నూతనంగా నిర్మిస్తున్న గృహాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఉల్లింగిపాలెంలో ఉన్న విలువైన మున్సిపల్ గుమ్మటాల చెరువును యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న మున్సిపల్ చెరువు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆ ప్రాంతానికే చెందిన అధికార పార్టీ చోటా నాయకుడు చెరువు స్థలాన్ని ఆక్రమించి జోరుగా విక్రయాలు సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటా నాయకుడు స్థలం కొనుగోలుదారులకు హద్దులు వేసి మరీ అప్పగిస్తున్నారు. దీంతో అక్కడ గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.


చెరువులో నిర్మించిన గృహాలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

గుమ్మటాల చెరువు ఆక్రమణ అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇటీవలే నేను బాధ్యతలు స్వీకరించడంతో పూర్తి వివరాలు తెలియదు. వివరాలు పూర్తిగా సేకరించి చర్యలు తీసుకుంటాం.

–హరిప్రసాద్, టీపీఓ, ఎంఎంసీ

రెండు సెంట్ల ప్లాట్ రూ. 1.30 లక్షలు

గుమ్మటాల చెరువులో రెండు సెంట్ల స్థలాన్ని రూ. 1.30 లక్షల చొప్పున విక్రయిస్తున్నట్లు ఆ ప్రాంతంలో చర్చనడుస్తోంది. ఈ మొత్తాన్ని చెల్లించిన వ్యక్తులకు అధికార పార్టీ చోటా నాయకుడు స్థలం అప్పగిస్తే ఆ వెంటనే నిర్మాణం చేపట్టాలని షరతు విధిస్తున్నాడు. దీంతో స్థలం చూపిన వెంటనే కొనుగోలుదారులు అక్కడ ఆగమేఘాలపై నిర్మాణాలు చేపడుతున్నారు. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులకు ఇంటి పన్ను వేయించడం, విద్యుత్ మీటర్ ఇప్పించడం వంటివి కూడా ఆ నాయకుడే చూసుకుంటున్నాడని స్థానికులు అంటున్నారు. శ్లాబ్ వేసుకుంటే నిర్మాణదారులు చోటా నాయకుడికి రూ. 30 వేలు అదనంగా చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు.

దాదాపు 9 ఎకరాలకు పైగా ఆక్రమణ

నగరంలోని ఉల్లింగిపాలెం ప్రాంతంలో 23, 25వ డివిజన్ పరిధిలో 18.23 ఎకరాల విస్తీర్ణంలో గుమ్మటాల చెరువు ఉంది. ఇప్పటి వరకు దాదాపు తొమ్మిది ఎకరాలకు పైగా చెరువును ఆక్రమించి గృహాలు నిర్మించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం చెరువులను పూడ్చకూడదు. అయినా ఇక్కడ కోర్టు తీర్పు అమలుకు మున్సిపల్ అధికారులు చొరవ చూపకపోవడంపై నగర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటీవల నగరంలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గుమ్మటాల చెరువు ప్రాంతంలో పర్యటించాలని నగరవాసులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ చెరువు ఆక్రమణను ఆయన స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


చెరువును ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డు

మిద్దె తోటను పరిశీలించిన కలెక్టర్

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీనగర్‌లో హైనీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేసి పదవీ విరమణ చేసిన ముంతాజ్ బేగం తన ఇంటిపై నిర్వహిస్తున్న మిద్దెతోటను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం పరిశీలించారు. ఇంటి పైన, పెరట్లోనూ రకరకాల పూలు, పండ్లు, కాయగూరల మొక్కలను సేంద్రీయ పద్ధతిలో పెంచుతుండటాన్ని చూసి కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న ఇంటిలో ఇన్ని మొక్కలు పెంచడం ఎలా సాధ్యమైందని.. వీటికి ఎరువులు ఎలా వేస్తున్నారని ఆమెను అడిగి తెలుసుకున్నారు. కంపోస్ట్, లిక్విడ్‌లు తదితర సహజమైన ఉల్లిపాయల తొక్కలు, ఆకులను మట్టిలో కుళ్లనించి తదుపరి మొక్కలకు ఎరువుగా వేస్తానని ఆమె కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ బాలాజీని శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఉన్నారు.


మిద్దె తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, చిత్రంలో ఎంఎంసీ కమిషనర్ బాపిరాజు

‘కిసాన్ సమ్మాన్ నిధి’ సద్వినియోగం చేసుకోవాలి

ఘంటసాల: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అందిస్తున్న కిసాన్ సమ్మన్ నిధి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మన్ నిధి ఆరవ వార్షికోత్సవం సందర్భంగా 19వ విడత నిధులు బదిలీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని సోమవారం రైతులకు, విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యుదయ రైతులు కేవీకేతో ఉన్న అనుభవాలు, అనుబంధాన్ని విద్యార్థులకు, ఇతర రైతులకు తెలియజేశారు. అనంతరం అభ్యుదయ రైతులైన వేమూరి రత్నగిరి రావు, మండవ కోటేశ్వరరావు, సింహాద్రి శ్రీమన్నారాయణ, అల్లూరి సీతారామరాజులను కేవీకే ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ రేవతి, డాక్టర్ యశ్వంత్ కుమార్, డాక్టర్ బి.నవీన్, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ కృష్ణవేణి, రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థినులు పాల్గొన్నారు.


రైతులను సన్మానించిన డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్తలు

నేటితో ముగియనున్న జ్ఞానజ్యోతి శిక్షణ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని మచిలీపట్నం నగరం, మండలంలోని 156 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు గత ఐదు రోజులుగా స్థానిక ప్రధాన పార్కు ఆవరణలోని రుస్తుంబాద మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ మంగళవారంతో ముగియనుంది. పలు అంశాలపై కార్యకర్తలకు అధ్యాపకులు బోధన, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలతో కార్యకర్తలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఆరేళ్లలోపు చిన్నారులకు పునాది విద్యను పటిష్టంగా, నాణ్యతతో అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ కే గ్లోరి, సూపర్‌వైజర్లు మాలతీదేవి, కృష్ణకుమారి, విజయకుమారి పర్యవేక్షించారు.


పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇస్తున్న దృశ్యం

టీస్టాల్స్‌కు గాజు గ్లాసుల పంపిణీ

అవనిగడ్డ: ప్లాస్టిక్, పేపర్ కప్‌లు వాడకాన్ని తగ్గించాలనే సంకల్పంతో చైల్డ్‌హుడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యాన టీస్టాల్స్‌కు గాజు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్, పేపర్ కవర్ల వాడకం వల్ల కలిగే అనార్థాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి అనిత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం చైల్డ్‌హుడ్ సేవాసంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శనీయం కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ సంస్థ ముద్రించిన గోడపత్రికలను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో దీవి లీలాకృష్ణ, బచ్చు మధుసూధనరావు, స్టార్‌రావ్, అన్నపరెడ్డి కృష్ణ, మోపిదేవి శ్రీనివాసరావు, బండే శ్రీనివాసరావు, కమ్మిలి ప్రసాద్, రేపల్లె అర్జునరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బడ్డీ కొట్లు తొలగింపు



ఎంఎంసీ కార్యాలయం పక్కన ఉన్న బడ్డీ కొట్లను తొలగిస్తున్న అధికారులు

మచిలీపట్నంటౌన్: నగరపాలకసంస్థ కార్యాలయ ప్రహరీ వెంబడి ఉన్న బడ్డీ కొట్లను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఆ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందనే కారణంతో వాటిని తొలగించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు సాగిస్తున్న వారు ఉపాధి కోల్పోయారు. ముఖ్యంగా బ్యాగ్‌ల రిపేరు, అమ్మకం సాగిస్తూ జీవనం సాగించే వారు ఉపాధి కోల్పోయారు. ఈ బడ్డీల తొలగింపును కమిషనర్ బాపిరాజు, టీపీఓ హరిప్రసాద్ పర్యవేక్షించారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో వేంచేసి యున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు, అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్య శర్మలు సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెను చేయనున్నట్లు చెప్పారు. 26వ తేదీ రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 27న రథోత్సవం, 28న రుద్రహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.


విద్యుద్దీపాల వెలుగులో స్వామివారి ఆలయం

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

అవనిగడ్డ: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం పది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 9,014 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 5,449 మంది పురుషులు, 3,565 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అవనిగడ్డ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రంలో 2,077 మంది, ఘంటసాల ఎంకే గాంధీ జెడ్పీ హైస్కూల్‌లో 1,219, చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్పీ జూనియర్ కళాశాలలో 2,028, మోపిదేవి జెడ్పీ హైస్కూల్‌లో 1,183, కోడూరు మండల మహిళా సమాఖ్య భవనంలో 1,411, నాగాయలంక జెడ్పీ హైస్కూల్‌లో 1,096 మంది గ్రాడుయేట్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా సోమవారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పనులు చేపట్టారు.

పెడన: ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంఛార్జి తహసీల్దారు కె. అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఇంఛార్జి ఆర్ఐ విజయలక్ష్మి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పట్టభద్రులంతా ప్రశాంతమైన వాతావరణంలో ఓటు వేసేందుకు చర్యలు చేపట్టామని ఇంఛార్జి తహసీల్దారు పేర్కొన్నారు.

అదనపు రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా పౌరసరఫరాల అధికారి పార్వతి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారులకు సిలిండర్లు పంపిణీ చేసే సమయంలో నిర్ణయించిన ధర కంటే అదనంగా రుసుం వసూలుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి వీ పార్వతి అన్నారు. జిల్లాలోని గ్యాస్ డీలర్లతో కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అదనపు రుసుం వసూలు చేసినట్లు వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువైతే ఏజెన్సీ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. దీపం–2 పథకం అమలు, ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలు ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నామని తెలిపారు. వినియోగదారులు సిలిండర్ నగదు చెల్లించే సమయంలో బిల్లులో ఉన్న ధర కంటే ఎక్కువ చెల్లించరాదన్నారు. ఫిర్యాదులు ఉంటే 1967 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ టీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వో పార్వతి

రూ.10 వేలు చెక్కు పంపిణీ

ఘంటసాల: ఘంటసాల హైస్కూల్ ప్లస్‌లో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందించాలని కోరుతూ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఆర్థిక శాస్త్రం విశ్రాంత అధ్యాపకుడు జాస్తి కుటుంబరావు హెచ్ఎం ఎం.శ్రీరంగవల్లికి రూ.10 వేల చెక్కును సోమవారం అందించారు. అనంతరం సహాయం అందించిన కుటుంబరావును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కుటుంబరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని శ్రీదుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. కృష్ణా జిల్లాతో పాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకు తరలిరానున్నారు. మంగళవారం స్వామివారి కల్యాణం, 26న తెప్పోత్సవం, 27న రథోత్సవం నిర్వహించనున్నారు.

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి, ఉపాలయాల శిఖర, నవగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు తెలిపారు. స్వామివారికి మహాశివరాత్రి సందర్భంగా మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాలయాల శిఖర, నవగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నిండా ముంచిన క్యాలీఫ్లవర్ పంట



కోసూరువారిపాలెం (మోపిదేవి): వాణిజ్య పంటలు, కూరగాయలు వేసిన రైతులు నిండా మునిగిపోతున్నారు. మొన్న క్యాబేజీ, నిన్న టమాటా, నేడు క్యాలీఫ్లవర్ పంటలకు కోత కూలీ కూడా రాకపోవడంతో రైతులు పొలంలోనే దున్నేస్తున్నారు. పాలకులు పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించడం లేదంటూ ఆగ్రహం వక్తం చేస్తున్నారు. మండలంలోని కోసూరువారిపాలెంలో రైతు కోసూరు రమణ వేసిన క్యాలీఫ్లవర్ ను సోమవారం ట్రాక్టర్‌తో దున్నేశారు. పువ్వుకు కనీసం రూ. 20లు ఉంటే కొంత వరకు రైతులు బతుకుతారని, కూలీలతో కోయించి మార్కెట్‌కు తరలిస్తే పువ్వు కేవలం రూ. 10లు కూడా పడటం లేదని వాపోయారు. డిసెంబర్ నుంచి 1,500 బస్తాలు కట్టింగ్ చేసి సంతలు, మార్కెట్‌కు తరలించామని, దీనిలో కేవలం కూలీలకు మాత్రమే వచ్చాయని, పెట్టుబడి ఏమాత్రం రాలేదన్నారు. ఎకరాకు సుమారు రూ. 1.50 లక్షలు పైగా ఖర్చుచేయగా ఒక్క రూపాయి కూడా ఆదాయం అందలేదని పూర్తిగా నష్టపోయినట్లు వాపోయారు. ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని చేసేది లేక పంటను పొలంలోనే దున్నేసినట్లు రైతు రమణ వివరించారు.


పశువుల సంరక్షణపై రైతులు శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు

గూడూరు: పశువుల సంరక్షణపై రైతులు శ్రద్ధ చూపాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులు అన్నారు. మండలంలోని మల్లవోలు గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీజన్ల వారిగా వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా వ్యవహరించి సకాలంలో టీకాలు వేయిస్తే పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటుగా అధిక పాల దిగుబడులు ఇస్తాయన్నారు. పశువులకు పౌష్టికరమైన ఆహార ప్రాముఖ్యతను వివరిస్తూ చైతన్యపరిచారు. వెటర్నరీ డాక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 69 గేదలకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించినట్లు వైద్యబృందం తెలిపింది.


వైద్యశిబిరంలో డాక్టర్ నరసింహులు, వైద్య బృందం

జల్లుస్నానాలకు పైప్‌లైన్ ఏర్పాటు



పెదకళ్లేపల్లి (మోపిదేవి): మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26వ తేదీన మండల పరిధిలోని పెదకళ్లేపల్లి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం కృష్ణానది వద్ద వృద్ధులు, పిల్లలకు అనుకూలంగా జల్లు స్నానం చేసేందుకు ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. పిండ ప్రధానం ఇతర అవసరాలకు పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో బోరు వేసి అక్కడ నుంచి నది వరకు ప్రత్యేకంగా మరో వాటర్ పైప్ కూడా ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి వివరించారు.

భవన నిర్మాణానికి సహకారం

అవనిగడ్డ: అవనిగడ్డ పెన్షనర్స్ అసోసియేషన్ భవనం ఫ్లోరింగ్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ భవనం ఫ్లోరింగ్ కోసం బెడ్‌కాంక్రీట్‌తో పనులు చేయించేందుకు ఆర్థిక సాయం అందిస్తానని చెప్పారు. అనంతరం భవనానికి విరాళం అందించిన కాశీభొట్ల నాగేశ్వరరావుని సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం రామకృష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, కోశాధికారి కే నాగేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. 52వేలు విరాళం



చల్లపల్లి: చల్లపల్లి ఒకటవ వార్డులోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి తమ వంతుగా చల్లపల్లి ఉప్పలవారి వంశస్థులు రూ. 52వేలు విరాళాన్ని స్వచ్ఛ సుందర చల్లపలి రథసారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. ఉప్పల సాంబశివరావు, ఉప్పల కోటేశ్వరరావులు చెక్కును అందజేశారు. రుద్రభూమి అభివృద్ధికి ముందుకు వచ్చి సాయం అందించినందుకు ఉప్పల వారిని డీఆర్‌కే ప్రసాద్ అభినందించారు.

క్లుప్తంగా

దుర్గా నాగేశ్వరస్వామి గ్రామోత్సవం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి గ్రామోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రాజాధిరాజ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పితే చర్యలు

ఘంటసాల: ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పితే ఉద్యోగులపై చర్యలు తప్పవని ఎంపీడీవో డి.సుబ్బారావు హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పట్టభద్రుల ఎన్నికల ప్రచారం చేస్తున్నారని డెమోక్రటిక్ ప్రొటక్షన్ ఫోర్స్ ప్రతినిధి డాక్టర్ సీహెచ్.రంగారావు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై మండల ఎంసీసీ నోడల్ అధికారి ఎంపీడీవో డి.సుబ్బారావు శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఎంఈవో–2 ఎండీ మోమిన్‌తో కలిసి సోమవారం విచారణ చేపట్టారు. ఈ నివేదికను తదుపరి చర్యల నిమిత్తం జిల్లా ఎంసీసీ నోడల్ అధికారికి సమర్పించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

కేఎస్ లక్ష్మణరావును గెలిపించండి



నాగాయితిప్ప(మోపిదేవి): కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు కోరారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మణరావుకు పార్టీ మద్దతుగా నిలుస్తోందన్నారు. అందులో భాగంగా సోమవారం అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదేశాల మేరకు నాగాయితిప్ప గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పాలకేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్‌బాబు, దివిమార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ లింగం జగదీష్‌కుమార్, కోసూరు ప్రభుకుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

అవనిగడ్డ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ డిపో నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడపనున్నట్టు డీఎం కే హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు అవనిగడ్డ, చల్లపల్లి నుంచి పెద కళ్లేపల్లికి, అవనిగడ్డ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు విశిష్ట గుర్తింపు రిజిస్ట్రేషన్‌పై అవగాహన



బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు రిజిస్ట్రేషన్‌పై మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెందుర్రు, మల్లేశ్వరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఏడీ గోపాల్, ఏఓ శివరామకృష్ణ రిజిస్ట్రేషన్‌లపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమాల్లో సచివాలయ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘంటసాల: ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘంటసాల మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ నెల 28వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని ఏఓ కోరారు.

నైతిక విలువలపై అవగాహన

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం నైతిక విలువలు, చట్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ ఎ. గణేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి, చెడు మధ్య ఉన్న తేడాలను గమనించి నడుచుకుంటే భవిష్యత్తు గొప్పగా ఉంటుందన్నారు. ఫోక్సో, మోటారు వాహన చట్టం, మైనర్ బాలికలు, మహిళల వేధింపులు తదితర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.